క్లుప్తంగా

'ఉపాధి' పథకం అమలు రాష్ట్ర కౌన్సిల్‌కు ఓ సభ్యుడు రాజీనామా

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలు రాష్ట్ర కౌన్సిల్(ఏపీఎస్‌ఈజీసీ)లో సభ్యుడిగా కొనసాగుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన జడ్పీటీసీ సభ్యుడు చిట్టి జనార్దన్ ఆ ఏపీఎస్‌ఈజీసీ సభ్యుని పదవికి రాజీనామా చేశారు. అతని రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతున్నట్లు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కూటమి ప్రభుత్వం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న దుంపల రామారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుంపల రామారావు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రైవేటు హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఏడు త్రైమాసికాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.4,900 కోట్లు బకాయిలు ఉండగా, ఇప్పటి వరకు రూ.900 కోట్లు మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. వసతి దీవెన కింద రూ.4,200 కోట్లు బకాయి ఉంటే, ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.2,000 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. దీంతో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు చేతులెత్తేసిన పరిస్థితి వచ్చిందన్నారు. నాడు–నేడు పనులన్నీ గాలికొదిలేసి స్కూల్స్ మూతపడేలా చేస్తున్న పరిస్థితిలో కూటమి పాలన ఉందన్నారు. పేదవాడికి మెడికల్ విద్యను అందించాలన్న సంకల్పంతో వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే, అందులో 10 కళాశాలలకు పైగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే పనికి సిద్ధపడ్డారని దుయ్యబట్టారు. కనీసం రైతులకు యూరియా ఇవ్వలేని దిక్కుమాలిన పరిస్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెవిటమ్మ తల్లి పాదుకల ప్రతిష్ట


పాదుక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గార: మండలంలోని జొన్నలపాడు గ్రామంలో చెవిటమ్మ తల్లి నూతన పాదుకల ప్రతిష్ట సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ దేవత కొత్తమ్మ తల్లి ఉత్సవాల ముందస్తు పూజల్లో భాగంగా అర్చకులు మంగళవాయిద్యాల నడుమ పాదుకల ప్రతిష్ట జరపగా, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

శ్రీకాకుళం అర్బన్: మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో నైపుణ్యాలు మెరుగుపరచడానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో అవసరమని శ్రీకాకుళం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కృష్ణాపార్క్ సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమంలో భాగంగా నగరంలోని పుణ్యపువీధి సచివాలయ పరిధిలోని దూదివారి సందు, కత్తిరివీధి1, 2, పుణ్యపువీధి 1, 2 సున్నపువీధి, పుప్పాలవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం జ్యోతి, ఎంఎస్‌కే సుమన్, పర్వీన బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

జి.సిగడాం: మండలంలో రైతులకు ఎరువుల కొరత రాకుండా, సకాలంలో పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ మహాదేవు సరిత, మండల వ్యవసాయ శాఖ అధికారి బెండి బాబ్జీ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మండలానికి సుమారుగా 1,650 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశామన్నారు. అదనంగా మరో 100 టన్నుల యూరియా మండలానికి చేరేందుకు సిద్ధం చేశామన్నారు. ప్రతీ రైతుకూ యూరియా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఎచ్చెర్ల: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. సోమవారం శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వికసిత్ భారత్ – 2047, స్వర్ణాంధ్ర – 2047 దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబులు చేస్తున్నటువంటి కృషిలో మనమందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, పీఆర్వో మామిడి షన్ముఖ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆగమనం


శ్రీకాకుళం కల్చరల్: హడ్కోకాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారు


శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో బాలత్రిపుర సుందరి అవతారంలో లలితాదేవి


శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో పూజలందుకుంటున్న బాలత్రిపుర సుందరీదేవి


ఎచ్చెర్ల: దోమాంలో పూజలందుకుంటున్న దుర్గాదేవి


జి.సిగడాం: జి.సిగడాం మొయిన్ రోడ్డులో...


శ్రీకాకుళం కల్చరల్: కత్తెరవీధి రాజరాజేశ్వరి పీఠంలో...

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల ఉత్సవాల కోసం కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో కూడా ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. తొలిరోజు దుర్గాదేవి వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. కుంకుమ, అఖండ దీపారాధన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్


గార: శ్రీకూర్మంలోని నవదుర్గా మండపంలో ప్రత్యేక పూజలు


గార: దుర్గాలయంలో మహిళల కుంకుమ పూజలు


శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో ఊరేగింపు...


జి.సిగడాం: డీఆర్‌వలస గ్రామంలో దుర్గాదేవిని ఊరేగిస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల: కుశాలపురంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


రణస్థలం: నేతేరు గ్రామంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న మహిళలు


శ్రీకాకుళం కల్చరల్: డే అండ్ నైట్ కూడలి మోటారు కార్మికుల ఊరేగింపు


శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయంలో పూజలు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


బాధితులకు సామగ్రి అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని జాడ గ్రామంలో ఈనెల 20న జరిగిన అగ్ని ప్రమాదంలో చల్లా అప్పయ్యమ్మ, చల్లా ఆదినారాయణ, పులపా నర్సింహుల పూరిళ్లు కాలిపోయాయి. దీంతో బాధితులకు రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా ప్రశాంత్ సాయికుమార్, పెంకి చైతన్య, ఉగ్రంకల నీలకంఠం యాదవ్ అధ్వర్యంలో తహసీల్దార్ మహాదేవు సరిత, సర్పంచ్ గోక మహేశ్వరరావు, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు చేతులమీదుగా వివిధ వస్తు సామగ్రిని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అబోతుల రాధి, వీఆర్వో సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: కర్నూలులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్‌లో భాగంగా ఫుట్‌బాల్ అండర్–19 పోటీలకు శ్రీకాకుళం జిల్లా సింగుపురం కేజీబీవీ నుంచి హాజరవుతున్న క్రీడాకారిణులకు స్పోర్ట్స్ కిట్లు సోమవారం అందజేశారు. క్రీడాకారిణులు కె.లావణ్య, బి కల్యాణి, బి.స్వప్న, ఆర్.లహరి, ఎన్.సుస్మిత, కె.అనురాధలకు రోటరీ క్లబ్ శ్రీకాకుళం ప్రెసిడెంట్ బరాటం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు మంత్రి వెంకటస్వామి, జైశ్రీరామ్, ఎంఆర్‌కే దాస్, అన్నెపు అనంతరావు, పీఈటీలు రెడ్డి రవి, అప్పన్నమ్మ, నారీ గ్రేస్, ఏపీ స్టేట్ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ముని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదోడిపై ప్రభుత్వం కుట్ర


మాట్లాడుతున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: పేదోడికి ఉచిత విద్య, వైద్యం అందకుండా ఉంచడానికే మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని దవళపేట గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఒక్క బస్తా యూరియా కోసం రైతులు ఎండా, వాన లెక్క చేయకుండా నానా పాట్లు పడుతున్నారన్నారు. ప్రశ్నించేవారిపై ఆక్రమంగా కేసులు పెట్టడం సరికాదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఇలా చేస్తే రానున్న రోజుల్లో తగిన మూల్యంక చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్, నాయకులు కంచరాన రమణారావు, శ్యామలరావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాధుల తోటను అభివృద్ధి చేసి చూపిస్తాం

శ్రీకాకుళం కల్చరల్: సమాధుల తోటను అభివృద్ధి చేసి చూపిస్తామని జిల్లా క్రైస్తవ సంక్షేమ మైనారిటీ సభ్యుల బృందం సభ్యులు తెలిపారు. జిల్లా క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమాధుల తోటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా కమిటీ పేరు చెప్పుకుంటూ సమాధుల తోటను అభివృద్ధి చేయకుండా, ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని నగరంలోని అన్ని సంఘాలకు బాధ్యతను అప్పగిస్తే కొంతమంది స్వార్థపరులు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వసూలు చేశారన్నారు. కనీసం వాటి లెక్కలు కూడా లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. విశ్రాంత ఉద్యోగి, పాస్టర్ నవీన్ సమాధుల తోటను ఎటువంటి అభివృద్ధి చేయక కాలయాపన చేసి, సుమారు 300 బరియల్ స్థలాల నుంచి రూ.25 లక్షలు పెద్ద మొత్తంలో వసూలు చేసి కబ్జా చేశారన్నారు. పాస్టర్ నవీన్‌కుమార్ తానే బరియల్ గ్రౌండ్ సెక్రటరీగా, కోశాధికారిగా బాధ్యతలు నిర్వహించి పేదవారికి కనీస గౌరవం లేకుండా చేశారన్నారు. పేదలకు ఒకలా, ధనవంతులకు ఒకలా పక్షపాతం చూపిస్తూ సమాజంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఇష్టారాజ్యానికి వాడుకోవడం వలన జిల్లాలో ఉండే క్రైస్తవ సంఘ కాపరులు, సంఘస్తులు, సంఘ పెద్దలు, విశ్వాసులు ప్రశ్నిస్తున్నారన్నారు. అన్నిటినీ ఎదిరించి క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా 80 మొక్కలను రోడ్లకి ఇరువైపులా నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ ప్రతినిధులు డిబిడిబి కుమార్, డివిడివి కుమార్, జాకబ్, చల్లా కరుణాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సమాధులను నేలమట్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం పట్టణ బరియల్ గ్రౌండ్ కమిటీ సభ్యులు, పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. నగరంలోని డగ్లస్ క్యాంపస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొత్త బ్రిడ్జి సమీపంలో సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ గోడకు ఆనుకుని ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సమాధులను శుభ్రత పేరిట విధ్వంసం చేయడం మనోభావాలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. నేలమట్టం చేసిన సమాధులపై మొక్కలు నాటడం వింత చర్యగా ఉందని ఆగ్రహించారు. 150 సమాధులను జేసీబీతో ధ్వంసం చేయించిన పాస్టర్లు చల్లా కరుణాకర్, మోహన్‌రావు, అధికారి జాకబ్, మోషే, డీబీడీబీ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బరియల్ గ్రౌండ్ ప్రెసిడెంట్ మండ ఎలీషా, సెక్రటరీ నవీన్, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కె.డానియల్, సెక్రటరీ కె.ప్రేమ్ కుమార్, బ్రదర్.ఒంపూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలే శ్రీరామ రక్ష


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య సిబ్బంది

- పశువులకు సకాలంలో టీకాలు
- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్

ఎచ్చెర్ల: పశువులకు టీకాలే శ్రీరామ రక్ష అని పశువైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పులు మొదలవగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. సకాలంలో వైద్యం అందకపోతే పశువులు మృత్యువాత పడే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాలు కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి అన్ని పశు వైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవాలను కాపాడుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు.

ట్యాగ్ ఆధారంగా టీకాలు

నియోజకవర్గం పరిధిలోని పశువైద్య సిబ్బంది గతేడాది పశువులకు ట్యాగ్‌లు వేశారు. ప్రస్తుతం ట్యాగ్ ఆధారంగా పశువులను గుర్తించి టీకాలు వేస్తున్నారు. ఇప్పటివరకు పశువులకు ట్యాగ్ వేయించుకోకపోతే ట్యాగ్ వేయించుకోవాలని పశు వైద్యులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో గేదెలు 1,414 ఉండగా, ఆవులు 55,047 ఉన్నాయి. నెల రోజులుపాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

- ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభమవుతుంది.
- ఈ సమయంలో పక్కవాటికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి సోకిన వాటికి 105 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది.
- నోట్లో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడుతాయి.
- నెల రోజల వయసున్న దూడలు ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణించే అవకాశం ఉంది.
- ఈ వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు.
- దుక్కి దున్నే పశువుల కాళ్ల మట్టలు కదిలిపోవడం వల్ల పని చేయలేవు.

నివారణ ఇలా..


వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరుచేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి.


ఎస్ఎస్ఆర్‌పురంలో టీకాలు వేస్తున్న సిబ్బంది

టీకాతో ప్రయోజనాలు

టీకా వేయడం వలన వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తి పెంచవచ్చు. వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెంపునకు, దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదపడుతుంది. పశువుల గుర్తింపునకు చెవికి ట్యాగ్ వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది. అయితే పశువులకు సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల సమస్యలను నివృత్తి చేసేందుకు వీలుగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా 1962 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధి సమస్యకు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం కల్పించారు.

వ్యాక్సిన్ వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందు వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తర్వాత కంటే రాకముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది. సకాలంలో వైద్యం అందిస్తే రోగం ప్రబలకుండా నివారించవచ్చు. లేకపోతే పశువులు చనిపోతాయి.

– వి.రమణ, పశువైద్యాధికారి, ఎచ్చెర్ల

సత్తాచాటిన క్రీడాకారులు


పతకాలు సాధించిన క్రీడాకారులతో అతిథులు, కోచ్‌లు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాలతో సత్తా చాటారు. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను సోమవారం నగరంలోని వైఎస్సార్ కల్యాణ మండపం వద్ద అభినందించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ చేతుల మీదుగా క్రీడాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్, మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు పతకాలు సాధిస్తుండడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. వీరిని తీర్చిదిద్దుతున్న కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు వై.హేమంత్‌కుమార్, చీఫ్ కోచ్ హరీష్, సీనియర్ న్యాయవాది తాండ్ర శ్రీనివాస్, తిరుపతిరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

26లోగా అభ్యంతరాలు తెలపాలి

గార: ఓటర్ల జాబితాపై ఈనెల 26లోగా అభ్యంతరాలు తెలపాలని తహసీల్దార్ ఎం.చక్రవర్తి సూచించారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు.